క్లుప్తంగా

దుర్గమ్మ నిత్యాన్నదానానికి విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి గుంటూరుకు చెందిన భక్తులు ఆదివారం విరాళాన్ని అందజేశారు. గుంటూరు బ్రాడీపేటకు చెందిన ఆకుల వెంకటేశ్వరరావు, బాల అనిత దంపతులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి వచ్చారు. ఆలయ అధికారుల్ని కలసి నిత్యాన్నదానానికి రూ. 1,21,518 విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ అధికారి అమ్మవారి ప్రసాదాలు, చిత్రపటం, శేషవస్త్రాల్ని బహూకరించారు.

వైభవంగా ఉరుసు మహోత్సవం



పాత గుంటూరు: ఆంధ్రా ముస్లిం కళాశాల సమీపంలోని శ్రీ హజరత్ మొహమ్మద్ ఖాసీం అలీషా ఖాదరీ దర్గా 101వ ఉరుసు మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం దీపారాధన భక్తి శ్రద్ధలతో జరిపారు. మాషుక్ సాహెబ్ కోలార్ చమన్ ఖలీఫా, కోమల్‌పాడు మొహమ్మద్ తాజుద్దీన్ సాహెబ్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమాన్ని ధర్మకర్త జనాబ్ మొహమ్మద్ మహమూద్ సాహెబ్, పీఠాధిపతి హజరత్ మొహమ్మద్ మన్సూర్ అహ్మద్ అలీషా ఖాదరీ అల్ హసనీ వల్ హుసైనీ, ట్రస్ట్ సభ్యులు షేక్ మీరా మొహిద్దీన్, రోషన్ జమీర్, ఖాజా మొయినుద్దీన్, మీరా మొయినుద్దీన్, మహమ్మద్ జిలాని పర్యవేక్షించారు.

అలరించిన భక్తి సంగీత విభావరి



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలోని అన్నమయ్య కళా వేదికపై శ్రీ సాయిరాగ సంగీత కళాశాల రెండో వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. సంస్థ వ్యవస్థాపకురాలు మునిపల్లె రమణి ఆధ్వర్యంలో జరిగిన భక్తి సంగీత విభావరిలో గాయకులు అన్నమయ్య కీర్తనలు, భక్తి కీర్తనలు ఆలపించి ప్రేక్షకుల్ని అలరించారు. వీరికి కీబోర్డ్‌పై ఆదాం, సాయి, ప్యాడ్స్‌పై ఈశ్వర్, తబలాపై పి.వి. రమణ వాయిద్య సహకారం అందించారు.

వెంగళాయపాలెంలో ఉచిత కంటి వైద్య శిబిరం



గుంటూరు రూరల్: మండలంలోని వెంగళాయపాలెంలో హెల్ప్ ఫౌండేషన్(సత్తెనపల్లి), కామాక్షి ఐ కేర్(చెరుకుపల్లి) సంయుక్తంగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామంలోని ప్రజలకు ఉచితంగా 190 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అర్హులైన వారికి కళ్ల జోళ్లు అందజేశారు. కంటి సమస్యలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యులు వివరించారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, శ్యామ్, రవి, వనిత, సదాశివరావు పాల్గొన్నారు.

కోదండ రామాలయ స్థిర ప్రతిష్టా మహోత్సవం

గుంటూరు రూరల్: మండలంలోని అంకిరెడ్డి పాలెంలో శ్రీ సీతాసమేత కోదండ రామాలయ స్థిర ప్రతిష్టా మహోత్సవాన్ని ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శ్యామల వెంకటరమణాదేవి పాల్గొన్నారు.

పరీక్షలంటే భయాన్ని వీడాలి

విశ్రాంత ఐపీఎస్ అధికారి లక్ష్మీనారాయణ



కార్యక్రమంలో పాల్గొన్న లక్ష్మీనారాయణ, స్కూల్ డైరెక్టర్లు

పాత గుంటూరు: విద్యార్థులంతా పరీక్షలంటే భయాన్ని వీడాలని విశ్రాంత ఐపీఎస్ అధికారి వి.వి. లక్ష్మీనారాయణ సూచించారు. సమయాన్ని వృథా చేయకుండా పరీక్షల్లో వచ్చే ప్రశ్నలను ముందే గ్రహిస్తే సునాయసంగా రాయవచ్చని తెలిపారు. ఆదివారం రాజాగారితోటలోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఏపీ ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, జూనియర్ రెడ్ క్రాస్ సంయుక్త ఆధ్వర్యంలో పరీక్షా పే చర్చా కార్యక్రమం నిర్వహించారు. సభకు రెడ్ క్రాస్ యూత్ కో–ఆర్డినేటర్ ఎస్.వి.ఎస్. లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా వి.వి. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సూర్యాస్తమయానికి ముందు భోజనం చేసి, సూర్యోదయానికి ముందు నిద్ర లేస్తే విద్యార్థులు ఆరోగ్యవంతంగా ఉంటారని పేర్కొన్నారు. పరీక్షలు అయిపోయే వరకు సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు.

కార్యక్రమంలో డాక్టర్ మాదుగుల నాగఫణి శర్మ, రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ పి. రామచంద్రరాజు, ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ రాష్ట్ర నేత మేకల రవీంద్రబాబు, జిల్లా అధ్యక్షుడు చెరుకూరి శ్రీహరి, నాయకులు వంగా శ్రీనివాసరావు, ఏ. సురేష్, మల్లికార్జునరావు, నర్రా రాజేష్, బత్తిన వెంకట్రావు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డుకు నాగమల్లేశ్వరరావు ఎంపిక



గవర్నర్ నుంచి అవార్డు అందుకుంటున్న నాగమల్లేశ్వరరావు

నెహ్రూనగర్: గ్లోబల్ ఇండియా బిజినెస్ ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేషనల్ అవార్డ్ ఫర్ బిజినెస్ ఎక్సలెన్స్ అండ్ ఇంటర్నేషనల్ బిజినెస్ సెమినార్ 2023 సంవత్సరానికి గాను బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డును రీజన్ ఆర్గానిక్స్ ఎండీ అన్నవరపు నాగమల్లేశ్వరరావు అందుకున్నారు. విజయవాడలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ నుంచి అవార్డును అందుకున్నారు. నగరంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ అవార్డు అందుకోవడంతో మరింత బాధ్యత పెరిగిందని చెప్పారు.

నేడు నగరపాలక సంస్థలో 'స్పందన'

నెహ్రూనగర్: స్థానిక సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయాల్లోనూ ప్రతి రోజు మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు స్పందన జరుగుతుందని, అక్కడ పరిష్కారం కాని సమస్యలపై నేరుగా తమకు అర్జీలు అందజేయవచ్చని ఆమె సూచించారు.

ఘనంగా సంత్ గురు రవిదాస్ జయంతి



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, పార్టీ నాయకులు

పాత గుంటూరు: కృష్ణ నగర్ 5వ లైనులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సంత్‌గురు రవిదాస్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అత్తోట జోసెఫ్ కుమార్, రైతు విభాగం కార్యదర్శి తియ్యగూర రామకృష్ణారెడ్డి, కొండముది భగవాన్‌దాస్, దర్శనపు శ్రీనివాస్, పినపాటి మోహన్‌రావు, పారంగి సత్యరాజు, నూతక్కి సతీష్, మాదిగ జనసేవా సమితి కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బాలోత్సవం నమోదు గడువు పొడిగింపు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య పాఠశాల వేదికగా ఈనెల 11,12 తేదీల్లో నిర్వహిస్తున్న గుంటూరు జిల్లా బాలోత్సవ నమోదు గడువును పాఠశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు పొడిగించినట్లు అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 23 అంశాల్లో నిర్వహిస్తున్న బాలోత్సవ్‌లో 4,5,6,7 తరగతుల విద్యార్థులకు జూనియర్, 8,9,10 తరగతులకు సీనియర్ విభాగాల్లో నిర్వహించే పోటీలకు శనివారం ముగిసిన గడువును ఈనెల 10వ తేదీ సాయంత్రం 5.00 గంటల వరకు పొడిగించినట్లు ఆయన పేర్కొన్నారు. ఎటువంటి ప్రవేశ రుసుం లేకుండా పోటీల్లో పాల్గొనేందుకు 97035 79996 నంబర్లో సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులను ప్రోత్సహించాల్సిందిగా స్కూళ్ల యాజమాన్యాల్ని కోరారు.

భక్తిప్రవత్తులతో సత్యదేవుని నగరోత్సవం



నగరోత్సవంలో పాల్గొన్న భక్తులు

పాత గుంటూరు: పట్టాభిపురంలోని శ్రీ రామ సత్యనారాయణస్వామి దేవస్థానం 46వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. సహస్ర దీపాలంకరణ సేవ, ఉంజల్ సేవలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం సువర్చలా ఆంజనేయస్వామి శాంతి కల్యాణాన్ని వేద పండితులు భక్తిశ్రద్ధలతో జరిపారు. సాయంత్రం సత్యదేవుని నగర ఉత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హైకోర్టు న్యాయమూర్తి బొప్పూడి కృష్ణమోహన్ దంపతులు పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి నగరోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమాల్ని ఆలయ చైర్మన్ చావలి గణపతి, రావిపాటి సత్యనారాయణ, కామేశ్వరరావు తదితరులు పర్యవేక్షించారు.

నేడు పెదకాకానిలో విద్యుత్ సరఫరా నిలిపివేత

పెదకాకాని: స్థానిక ప్రధాన సెంటర్ నుంచి పాతూరు వైపు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ బత్తుల శ్రీనివాసరావు తెలిపారు. మహాశివరాత్రి పర్వదినానికి ఏర్పాట్ల నిమిత్తం లైన్ల మరమ్మతులు చేపట్టడం జరిగిందని చెప్పారు. పెదకాకానిలో తూర్పు వైపు సోమవారం ఉదయం 8 గంటల నుంచి 2 గంటల వరకు అంతరాయం కలుగుతుందన్నారు. విద్యుత్ సరఫరాలో ఏర్పడిన అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

క్రైమ్ కార్నర్

యువతి అదృశ్యం

గుంటూరు ఈస్ట్: యువతి అదృశ్యంపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. గుజ్జనగుళ్లలో నివసించే ఓ కుటుంబానికి చెందిన యువతి ఆఫీసుకని చెప్పి ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వ్యభిచారం కేసులో ఇద్దరి అరెస్టు

వ్యభిచారం కేసులో ఇద్దరిని అరండల్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. నాయుడుపేటలోని ఓ ఇంట్లో మురళీమోహన్‌రెడ్డి, ఆదిలక్ష్మి వ్యభిచారం నిర్వహిస్తుండగా శనివారం పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి ఆదివారం అరెస్టు చేశారు.

కోత ముక్క నిర్వహిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

కోత ముక్క నిర్వహిస్తున్న వ్యక్తిపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. కప్పల వారి వీధికి చెందిన గురజాల కరుణ ఆదివారం ఆర్టీసీ బస్టాండు ఎదురుగా రోడ్డు పక్కన కోత ముక్క ఆట నిర్వహిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి, నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు. రూ.2,300తో పాటు పేకముక్కలు స్వాధీనం చేసుకున్నారు.

వ్యక్తి అదృశ్యం



వ్యక్తి కనిపించకుండా పోయిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. అరండల్‌పేటకు చెందిన 34 సంవత్సరాల యేరువ దిలీప్ రెడ్డి శనివారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్లిపోయాడు. అతని ఆచూకీ కోసం వెతికిన కుటుంబసభ్యులు కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫోటోలోని వ్యక్తిని గుర్తించిన వారు 8688831332కు సమాచారం ఇవ్వాలని కోరారు.

గాడిద మాంసం విక్రయిస్తున్న వ్యక్తులపై కేసు

గాడిద మాంసం విక్రయిస్తున్న గుర్తు తెలియని వ్యక్తులపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం శ్రీనివాసరావుపేట శ్మశానం సమీపంలో గాడిద మాంసం విక్రయిస్తుండగా, జాగు సురేష్, బ్రహ్మం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మాంసం విక్రయిస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు.

మద్యానికి బానిసైన వ్యక్తి రోడ్డుపై మృతి

మద్యానికి బానిసైన వ్యక్తి రోడ్డుపై మృతి చెందిన సంఘటనపై లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. డి.ఎస్. నగర్‌కు చెందిన వెంకట శివయ్య (35) మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం ఏటుకూరు రోడ్డుపై మృతి చెంది పడి ఉన్నాడు. స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళకు అసభ్యంగా సైగలు చేసిన వ్యక్తిపై కేసు

ఓ వ్యక్తి మహిళకు అసభ్యంగా సైగలు చేసిన ఘటనపై లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. లాలాపేటలో నివసించే రోషన్ తన ఇంటి సమీపంలో నివసించే మహిళకు ఆదివారం అసభ్యంగా సైగలు చేశాడు. విషయం తెలిసిన ఆమె కుటుంబ సభ్యులు రోషన్‌పై దాడి చేసి గాయపరిచారు. ఇరు కుటుంబాల ఫిర్యాదుల మేరకు పోలీసులు రెండు వైపులా కేసులు నమోదు చేశారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వ్యక్తులకు కౌన్సెలింగ్

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వ్యక్తులకు పాత గుంటూరు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారికి కోసం ఆదివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పొన్నూరు రోడ్డు , నందివెలుగు రోడ్డు, కాకాని రోడ్డుల్లో 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

వైభవంగా వల్లభరాయుని కల్యాణం



వంగిపురం (ప్రత్తిపాడు): వల్లభరాయుని కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. వేద పండితుల వేద మంత్రోచ్చారణల నడుమ వల్లభరాయుడు రాజ్యలక్ష్మీదేవిని పరిణాయమాడిన ఘట్టంతో భక్తులు పులకించిపోయారు. రాజ్యలక్ష్మీ సమేత వల్లభరాయస్వామి బ్రహ్మోత్సవాలు ఆలయ కార్యనిర్వహణాధికారి పర్యవేక్షణలో ఘనంగా జరుగుతున్నాయి. శనివారం రాత్రి భక్తులు సమక్షంలో స్వామి కల్యాణోత్సవాన్ని వంశపారంపర్య ధర్మకర్త దూపాటి రత్నకిరణ్‌తో అర్చకులు సంధ్యాల సుదర్శనాచార్యులు, లక్ష్మీ వల్లభాచార్యులు, కొండమాచార్యులు చేయించారు. భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం గరుడ వాహనంపై స్వామి వారు, హంస వాహనంపై అమ్మవారుకి గ్రామోత్సవం నిర్వహించారు.

కనుల పండువగా లక్ష్మీతిరుపతమ్మ కల్యాణం



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సుచరిత తదితరులు

గుంటూరు రూరల్: భక్తులు కోరిన కోరికలు తీర్చే దేవత లక్ష్మీతిరుపతమ్మతల్లి అని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి పేర్కొన్నారు. నగర శివారుల్లోని ఇన్నర్ రింగ్ రోడ్డు 48వ డివిజన్ రెడ్డిపాలెంలోని లక్ష్మీతిరుపతమ్మ, గోపయ్య స్వామివార్ల ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం నిర్వహించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ జిల్లా ఇంచార్జ్, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డితో కలసి పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలను నిర్వహించారు. స్వామివార్ల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం రాజ్యసభ సభ్యుడు మాట్లాడుతూ దేవుని సన్నిధిలో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీ తిరుపతమ్మ స్పిరిచ్యువల్ సర్వీసెస్ సొసైటీ ఆధ్వర్యంలో ఇటువంటి ఉత్సవాలను నిర్వహించటం సంతోషకరమని తెలిపారు.

నేత్రపర్వంగా గాయత్రీ మహాయజ్ఞం



ప్రత్తిపాడు: గాయత్రీ మంత్ర జపంతో ప్రత్తిపాడు మార్మోగింది. వేద మంత్రోచ్చారణల నడుమ గాయత్రీ మహాయజ్ఞం కన్నుల పండువగా జరిగింది. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడు అక్షయ స్కూల్ ఆవరణలో ఆదివారం గాయత్రీ పరివార్ ఆధ్వర్యంలో గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించారు. ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు మిరియాల సత్యనారాయణబాబు, మండవ ప్రసాద్, చాగంరెడ్డి శివగోవింద్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన యజ్ఞంలో దంపతులు, విద్యార్థులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గాయత్రీ త్రిశక్తి పీఠానికి చెందిన డాక్టర్ శ్రీరామ్ మహా యజ్ఞం చేయించారు. అనంతరం జరిగిన అన్నదానంలో భక్తులు వందల సంఖ్యలో పాల్గొన్నారు. దేవతామూర్తులను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

తెలుగు ధిక్కార కవులు కలేకూరి, మద్దూరి, పైడి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ తదితరులు

పాత గుంటూరు: తెలుగు సాహిత్యంలో ధిక్కార కవులుగా కలేకూరి ప్రసాద్, మద్దూరి నగేష్ బాబు, పైడి తెరేష్ బాబు చరిత్రలో నిలిచిపోయారని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం బ్రాడీపేటలోని ఒక హోటల్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జాషువా, పూలే, పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ అధ్యక్షుడు బి. విల్సన్ ఆధ్వర్యంలో కలేకూరి ప్రసాద్, మద్దూరి నగేష్ బాబు, పైడి తెరేష్ బాబు దళిత బహుజన తత్వం అంశంపై ఈనెల 11వ తేదీ సాయంత్రం 5 గంటలకు జరిగే కార్యక్రమం ఆహ్వాన పత్రికలు ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ కలేకూరి ప్రసాద్, మద్దూరి నగేష్ బాబు, పైడి తెరేష్‌బాబు దళిత అస్తిత్వాన్ని తెలుగు సాహిత్యంలో బలంగా వినిపించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో విరసం నాయకులు సి.ఎస్.ఆర్. ప్రసాద్, కవులు ఎఫ్.ఎం.సుభాని, చంద్రపాల్, శ్యాంబాబు, కడియం జేమ్స్, బండారు సురేష్ బాబు, న్యాయవాది సంజీవరెడ్డి మార్పుల పాల్గొన్నారు.

లిక్విడ్ గంజాయి కేసులో పాత నేరస్తుడి అరెస్టు



నిందితుడు మస్తాన్‌వలితో సీఐ రమేష్, సిబ్బంది

నగరంపాలెం: లిక్విడ్ గంజాయి కేసులో మరొకరిని అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ గుంటూరు–2 స్టేషన్ సీఐ ఎం.రమేష్ ఆదివారం తెలిపారు. ఈనెల 1న ఎస్ఈబీ గుంటూరు–2, డీఎస్ఈటీ బృంద పోలీసులు గుంటూరు క్లబ్ వద్ద వాహన తనిఖీలు చేశారు. ఈ క్రమంలో బైక్‌పై వెళ్తున్న ఇద్దరిలో ఒకరిని అరెస్టు చేసి, రూ.1.40 లక్షల లిక్విడ్ గంజాయితో పాటు మోటారు సైకిల్‌ను సీజ్ చేశారు. పరారైన మారుతీనగర్‌కు చెందిన తాజుద్దీన్‌తోపాటు అదే ప్రాంతానికి చెందిన శివప్రసాద్‌ను అరెస్టు చేశారు. ఇదే కేసులో మరో కీలకమైన నేతాజీనగర్ ఎనిమిదో వీధికి చెందిన షేక్ మస్తాన్‌వలి అలియాస్ బుడ్డాయ్‌ని అరెస్టు చేసినట్లు సీఐ చెప్పారు. అతని నుంచి అరవై గ్రాముల లిక్విడ్ గంజాయి డబ్బాలు ఐదింటిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నర్సీపట్నం లోతుగట్టు జంక్షన్ వద్దకెళ్లి గంజాయి తీసుకొచ్చి తాగుతూ, విక్రయించేవాడని దర్యాప్తులో వెల్లడైందని తెలిపారు. పెయింటింగ్ పనులకు వెళ్లే అతనిపై పట్టాభిపురం పీఎస్‌లో రెండు కేసులు నమోదైనట్లు ఆయన చెప్పారు.

హక్కుల కమిషన్ సభ్యుడు శ్రీనివాస్‌కు సన్మానం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఏఎన్‌యూ లా విభాగ పూర్వ విద్యార్థులు

ఏఎన్‌యూ: రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సభ్యుడు, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ న్యాయశాస్త్ర విభాగ పూర్వ విద్యార్థి డాక్టర్ గోచిపాత శ్రీనివాస్‌ను లా విభాగ పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. యూనివర్సిటీలో ఆదివారం జరిగిన ఏఎన్‌యూ లా పూర్వ విద్యార్థుల సమావేశంలో పాల్గొన్న డాక్టర్ శ్రీనివాస్‌కు పూర్వ విద్యార్థులైన ఆయన మిత్రులు ఈ ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తమ సహచరుడు, లా విభాగ పూర్వ విద్యార్థి రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకమైన పదవిలో ఉండటం అభినందనీయమని తెలిపారు. యూనివర్సిటీ సమీపంలోని నంబూరు గ్రామానికి చెందిన శ్రీనివాస్ విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని సాధన కోసం కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగిరెడ్డి, లా విభాగ పూర్వ విద్యార్థులు, డాక్టర్ చందు పాల్గొన్నారు.

నేడు వీరమ్మ పేరంటాళ్ల తిరునాళ్ల



పెదకాకాని వీరమ్మ పేరంటాళ్లు అమ్మవారు



విద్యుత్ కాంతులలో వీరమ్మ పేరంటాళ్ల ఆలయం

పెదకాకాని: ఉయ్యూరు వీరమ్మ పేరంటాళ్ల అమ్మవారి తిరునాళ్లకు ఆలయం ముస్తాబు అయింది. పెదకాకాని ప్రధాన సెంటర్‌లోని శ్రీ పేరంటాళ్ల అమ్మవారి తిరునాళ్ల పురస్కరించుకుని ఐదు రోజులుగా అమ్మవారిని ట్రాక్టర్‌పై అలంకరించి తక్కెళ్ళపాడు, వెనిగండ్ల, పెదకాకాని గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం నిర్వహించారు. తిరునాళ్ళ సందర్భంగా బహుళ పాడ్యమి సోమవారం ఉదయం 11 గంటలకు గ్రామోత్సవం ముగించుకుని అమ్మవారు దేవాలయం చేరుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.కోటేశ్వరరావు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ముదరపోలు పోయుట, 7 గంటలకు గ్రామసిడి, సింకా వారి బోనం, భక్తులతో సిడిమాను మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఆలయం విద్యుత్ కాంతులతో కళకళలాడుతోంది. భక్తుల సిడిమాను ప్రదర్శన పెదకాకాని పేరంటాళ్ళ అమ్మవారి తిరునాళ్లకు ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు. కోరిన కోర్కెలు తీర్చమని భక్తులు అమ్మవారిని వేడుకోవడం, గత ఏడాది కోరుకున్న కోర్కెలు తీరిన వారి సిడిమా తిరిగి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ. సిడిమాను తిరిగే భక్తులు తిరునాళ్ళ రోజు ఉదయం నుంచి ఉపవాసం ఉంటారు. ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని సిడిమాను తిరుగుతారు. ఈ సందర్భంగా గంపలో కూర్చుని పైనుంచి పండ్లు, ఆకులు, పసుపు కుంకుమలతో కిందకు వదలడం, వదిలిన పండ్లు, కాయల కోసం భక్తులు కొంగులు చాపి అందుకోవడం ప్రత్యేకత. ఇప్పటికే ఆలయ ప్రాంగణం అంతటా రంగుల ర్రాట్నాలు, బొమ్మల బండ్లు, తినుబండారుల వ్యాపారులతో సందడిగా మారింది. తిరునాళ్లకు సమీప గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. దేవస్థానం అధికారులు, పంచాయతీ, పోలీసుశాఖ తదితర అధికారులు కమిటీ పెద్దలతో కలసి తిరునాళ్ళ విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు చేపట్టారు.

మంచాలలో గాయత్రీ మహాశక్తి స్తూప ప్రతిష్ట



చండీ హోమంలో భక్తులు, పండితులు

మంచాల(చేబ్రోలు): విశ్వశాంతి, లోక కల్యాణం కోసం చేబ్రోలు మండలం మంచాల గ్రామంలో ఆదివారం గాయత్రీ మహాశక్తి స్తూప ప్రతిష్టాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఆదిలక్ష్మి కామేశ్వరి దేవాలయం వెనుక స్థలంలో ఆలయ వ్యవస్థాపకులు శిష్టాల పూర్ణచంద్ర శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. 108 కలశాలతో, 24లక్షల గాయత్రీ మంత్రలేఖన పుస్తకాలతో గ్రామంలో శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శంబల ఆశ్రమం ప్రతినిధులు యుగంధర్, విజయశ్రీ, స్థానిక రుత్వికులు 24 రాగి యంత్రాలకు 24మంది దంపతులతో పూజ నిర్వహించారు. 27 హోమ గుండాలతో గాయత్రీ హోమాల కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చండీ హోమం నిర్వహించారు. అనుగ్రహ మూల మంత్ర హోమం, నక్షత్ర, గ్రహ మహా మృత్యుంజయ హోమాలు కన్నుల పండువగా నిర్వహించారు. వేలాది మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. దేశ, రాష్ట్ర, గ్రామ క్షేమం, సుఖ శాంతులకు గాయిత్రీ మహాయజ్ఞం దోహదం చేస్తుందని శిష్టాల పూర్ణచంద్ర శ్రీనివాసమూర్తి తెలిపారు.